మధ్యాన్న భోజనంలో నాణ్యత పాటించాలి

● జిల్లా విద్యాధికారి సత్యనారాయణ

మల్యాల మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న సత్యనారాయణ

బొమ్మలరామారం, మార్చి24 : పాఠశాల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం తయారీలో నాణ్యత పాటించాలని జిల్లా విద్యాధికారి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను, మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం తయారీని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలకు సమయానికి రావాలని అన్నారు. మధ్యాన్న భోజనంలో బ్రాండెడ్ నూనెలు, తాజా కూరగాయలు మాత్రమే వినియోగించాలని తెలిపారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని, కోడి గుడ్లు వారంలో మూడుసార్లు అందించాలని చెప్పారు. ఆయన వెంట ఎంఈఓ రోజారాణి, జీహెచ్‌ఎం వరలక్ష్మి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అనీమా, తదితరులు ఉన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

● రైతు సంఘం నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి జక్కా దయాకర్‌రెడ్డి

అడ్డగూడూరు, మార్చి 24 : ఎలాంటి షరతులు లేకుండా రూ. 2లక్షల వరకు రుణమాఫీ చేయాలని జిల్లా రైతు సంఘ సహాయ కార్యదర్శి జక్కా దయాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం రైతు సంఘం మండల మూడో మహాసభ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. రైతుభరోసా, రుణమాఫీ విడుదల చేయాలని, అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని, పాల రైతులకు ప్రతి 15 రోజులకొకసారి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతు సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకొన్నారు. అధ్యక్షులుగా బొనుగ సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సొలిపురం నాగిరెడ్డి, ప్రధానకార్యదర్శిగా చేడిపల్లి రవీందర్, సహాయ కార్యదర్శిగా బొంగు లింగయ్య, కోశాధికారిగా జక్కుల దుర్గయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు చేడే చంద్రయ్య, మండల కార్యదర్శి రేకల శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్, నాయకులు ఉప్పుల కొమురయ్య, బెల్లి శ్రీకాంత్, ఎల్లంల నరేశ్, పట్టేటి యాదగిరి, తుప్పతి లక్ష్మీనారాయణ, మహేశ్, యాదయ్య పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి

● సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చంద్రారెడ్డి

ఎంపీడీఓ ఆఫీసు ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

బీబీనగర్, మార్చి 24 : ఆస్తిపన్ను చెల్లించిన ఇండ్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయని గ్రామ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తుంటే పోలీసులు వచ్చి అరెస్టు చేయడం తగదని, వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోమటిరెడ్డి చంద్రారెడ్డి అన్నారు. బీబీనగర్ ఎంపీడీఓ ఆఫీసు ఎదుట సోమవారం ధర్నాలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ఉద్యమాలపైన నిర్బంధాన్ని ప్రయోగిస్తూ, ముందస్తు అరెస్టులతో నియంత పాలన కొనసాగిస్తున్నదని అన్నారు. ఎంపీఓ, డీపీఓలు ప్రభుత్వ పెద్దలు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల కనుసన్నలలో విధులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. బీబీనగర్‌లోని వీజీపీ వెంచర్‌లో గ్రామ పంచాయతీకి చెందిన నాలుగు ఎకరాల భూమిని ప్రైవేటు వ్యక్తులు విక్రయిస్తే పంచాయతీ అధికారులు ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని తెలిపారు. ఈ విషయంపై ఈ నెల 19న కలెక్టర్, ఈ నెల 20న పంచాయతీరాజ్ కమిషనర్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, నాయకులు ఒవల్దాస్ సతీశ్, శ్రవణ్, కోట శంకర్, పంజాల జంగయ్య, వెలువర్తి శ్రీకాంత్, కుమ్మరి రాజు, పొట్ట యాదమ్మ, సత్తయ్య, వెంకటయ్య, పూలమ్మ, ఊట్కూరి పున్నమ్మ, గంగమ్మ, యాదగిరి, ముత్యాలమ్మ, పొట్ట రమేశ్, పల్లెపాటి ధనమ్మ పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల కోసం దివ్యాంగులకు ఇంటర్వ్యూ

ఆత్మకూర్.ఎం : ఇంటర్వ్యూ చేస్తున్న ఎంపీడీఓ రాములునాయక్, సీడీపీఓ జ్యోత్స్న

ఆత్మకూరు(ఎం), మార్చి24 : మహిళా శిశు వయో వృద్ధులు, దివ్యాంగుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు వందశాతం సబ్సిడీ ద్వారా అందజేయనున్న రుణాల కోసం సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాములునాయక్, సీడీపీఓ జ్యోత్స్న మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల నుంచి రుణం కోసం 53మంది దివ్యాంగులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోగా 43మంది ఇంటర్వ్యూకు హాజరైనట్లు తెలిపారు. ఇందులో ముగ్గురు అభ్యర్థులను ఎంపిక చేసి సంబంధిత అధికారులకు పంపుతామని చెప్పారు. ప్రతి సంవత్సరం ఎంపికైన ఒక్కో అభ్యర్థికి రూ.50వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ లోకేశ్వర్‌రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు జ్యోతి, హబీబీ పాల్గొన్నారు.

పోచంపల్లిలో 27 మంది హాజరు

భూదాన్‌పోచంపల్లి : దివ్యాంగ కార్పొరేషన్ ద్వారా మండలానికి మంజూరైన ఒక యూనిట్ రూ. 50వేల లోను కోసం లబ్ధిదారుల ఎంపికకు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలో 27 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాపర్తి భాస్కర్‌గౌడ్, ఐసీడీఎస్ సీడీపీఓ శైలజ, సూపర్‌వైజర్లు శ్రీదేవి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి రహిత జిల్లాగా మార్చాలి

● అదనపు కలెక్టర్ వీరారెడ్డి

క్షయవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి అర్బన్, మార్చి 24: యాదాద్రి భువనగిరి జిల్లాను క్షయవ్యాధి రహిత జిల్లాగా మార్చాలని జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా వైద్యాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏరియా దవాఖాన నుంచి క్షయవ్యాధి నివారణ అవగాన ర్యాలీని సోమవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి నివారణకు వైద్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం డీఎంహెచ్ఓ మనోహర్ మాట్లాడుతూ వ్యాధి నివారణకు జిల్లాలో విశిష్ట సేవలు అందించాలని తెలిపారు. ఈ వ్యాధి రోగి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు గాలిద్వారా వ్యాపిస్తుందన్నారు. ఎరవైన రెండు వారాలకు పైగా తగ్గని జ్వరం, బరువు తగ్గినట్లైతే దగ్గరలోని ప్రభుత్వ దవాఖానలో పరీక్ష చేయించుకోవాలని చెప్పారు.జిల్లాలో టీబీ రహిత గ్రామాలను గుర్తించి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు అన్ని ఏర్పాట్లు చేయాలి

భువనగిరి కలెక్టరేట్ : జిల్లాలో యాసంగి ధాన్యం సేకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. భువనగిరి మండల పరిధిలోని వడాయిగూడెం గ్రామంలోని సురేంద్రపురి వాసవి సత్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో సుమారు 2,75,000 ఎకరాల్లో వరి సాగు చేసినందున సుమారుగా 7 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని, కొనుగోలు కేంద్రాలకు 4,50,000 టన్నుల ధాన్యం రానున్నదని అంచనా వేశారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో కొనుగోళ్ల ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు. నిర్వాహకులు ఏప్రిల్ మొదటి వారం నుంచి ధాన్యం వచ్చిన ప్రాంతాలలో స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి వారి సమక్షంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సూచించారు. రైతులు ధాన్యాన్ని తూర్పార పట్టి, ఆర బెట్టి తగిన తేమ శాతం వచ్చాక కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలని తెలిపారు.

ప్రజావాణి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

భువనగిరి కలెక్టరేట్ : ప్రజావాణి సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిద మండలాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. సోమవారం ప్రజల నుంచి 57అర్జీలను స్వీకరించామని, అందులో రెవెన్యూ శాఖ-43, మున్సిపాలిటీ-3, జిల్లా పంచాయతీ శాఖ-3, గ్రామీణాభివృద్ధి శాఖ-2, దేవాదాయ శాఖ, సంక్షేమ, లేబర్, వ్యవసాయ, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్‌కు ఒక్కొకటి చొప్పున ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీధర్, జిల్లా మార్కెటింగ్ అధికారి సబిత, జిల్లా పౌర సరఫరాల అధికారి వనజాత, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ డి.హరికృష్ణ, జడ్పీ సీఈఓ శోభారాణి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జగన్మోహన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ఏఎస్‌ఐ రాములు గౌడ్‌కు భిక్షమయ్యగౌడ్ పరామర్శ

రాజమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్

భువనగిరి కలెక్టరేట్, మార్చి 24 : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని నమాత్‌పల్లి గ్రామానికి చెందిన ఏఎస్‌ఐ బత్తిని రాములు గౌడ్ తల్లి రాజమ్మ దశదినకర్మ సోమవారం జరిగింది. ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ రాజమ్మ చిత్రపటానికి పూలమాల వేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో భువనగిరి పట్టణ మహిళా పోలీస్ స్టేషన్ సీఐ అర్జునయ్య, మాజీ ఎంపీపీ అతికం లక్ష్మీనారాయణగౌడ్, యాదగిరిగుట్ట బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కోల వెంకటేశ్‌గౌడ్, కుటుంబ సభ్యులు బత్తిని మల్లేశం, బత్తిని బాలనరసింహ, బత్తిని శ్రీనివాస్, బత్తిని శేఖర్, బత్తిని శ్రీధర్, బత్తిని వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు

అడ్డగూడూరు,మార్చి 24: సబ్సిడీలో వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి పాండురంగాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా మండల వ్యవసాయ శాఖ ద్వారా 50 శాతం సబ్సిడీపై రోటవేటర్స్- 2, హ్యాండ్ స్ప్రేయర్స్ -5 , పవర్ స్ప్రేయర్స్ - 4, కల్టివేటర్స్, ఎంబీ ప్లవ్స్, డిస్ హర్-3, బండ్ ఫార్మర్ -1 అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ పథకానికి భూమి ఉన్న మహిళ రైతులు మాత్రమే అర్హులని తెలిపారు. ఈ నెల 25 నుంచి 27 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నామని, దరఖాస్తుదారులు పట్టా పాసుపుస్తకం, ఫొటోలు, ఆధార్, ట్రాక్టర్ ట్రాలీ ఇంప్లిమేట్స్ కోసం ఆర్‌సీ అప్లికేషన్ ఫామ్ ఇచ్చి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పింఛన్ ఇప్పించండి సారూ..

● ఎనిమిది నెలలుగా అందక ఒంటరి వృద్ధురాలి అవస్థ

పింఛన్ ఇప్పించాలని వేడుకుంటున్న వృద్ధురాలు దాశవ్వ

సంస్థాన్ నారాయణపురం, మార్చి 24 : కొంతకాలంగా వచ్చిన పింఛన్ ఆగిపోయిందని, తిరిగి ఇవ్వాలని వేడుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఓ ఒంటరి వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నది. సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రానికి చెందిన దాశవ్వ ఒంటరి వద్ధురాలు. ఆమెకు వచ్చే పింఛన్‌తోనే బతుకు వెళ్లదీస్తున్నది. ఆరోగ్యం బాగా లేకపోవడంతో గత సంవత్సరం మూడు నెలల పాటు పింఛన్ తీసుకోలేదు. దాంతో గతేడాది ఆగస్టు నుంచి పింఛన్ నిలిచిపోయింది. ఎనిమిది నెలల నుంచి పింఛన్ ఇప్పించాలని పోస్టాఫీసు, గ్రామ పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. 'నాకు ఎవ్వరు లేరు.. పానం బాగుంటలేదు, చెవులు సరిగ్గా వినిపిస్తే లేవు, ఏదీ గుర్తుంటలేదు, నెలనెలా వచ్చే పైసలతోనే బతుకుతున్నా, ఎనిమిది నెలల సంది పింఛన్ పైసలు వస్తలేవు, చానా ఇబ్బంది అయితున్నది, మందులు అయిపోయినాయి, పింఛన్ పైసలు ఇప్పిస్తే మందులు తెచ్చుకుంటా' సారూ అంటూ దాశవ్వ కన్నీటి పర్యంతమవుతున్నది. దాశవ్వకు వినికిడి లోపం ఉన్నా సదరం సర్టిఫికెట్ తీసుకోవాలని తెలియకపోవడంతో వికలాంగులకు వచ్చే నాలుగు వేల పింఛన్ కోల్పోతున్నది.

భార్యాభర్తల హత్యకేసులో నిందితుడికి పదేండ్ల జైలు

నిందితుడు రాసాల రాజమల్లు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 24 : భార్యాభర్తల హత్య కేసులో నిందితుడికి పదేండ్లు జైలు శిక్ష, రూ, 20వేల జరిమానా విధిస్తూ సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు తీర్పునిచ్చారు. భువనగిరి రూరల్ సీఐ వారణాసి సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం 2023 అక్టోబర్ 5న మండలంలోని తుక్కాపురం గ్రామానికి చెందిన గుంటి బస్వయ్య తన ఇంటి ముందు గల గొర్రెల దొడ్డిలోని గొర్రెలను మేపడానికి వెళ్తున్న క్రమంలో ఇంటి పక్కనే ఉన్న రాసాల రాజమల్లు ఆలియాస్ రాజమల్లయ్య తన ఇంటి ముందు నుంచి గొర్రెలను తీసుకువెళ్లొద్దని, ఎన్నిసార్లు చెప్పినా వినడంలేదని ఆవేశానికిలోనై గొడవకు దిగాడు. ఈ క్రమంలో అక్కడే ఉన్న పారతో బస్వయ్య తలపై బలంగా కొట్టాడు. అడ్డువచ్చిన బస్వయ్య భార్య తిరుపతమ్మను సైతం తలపై కొట్టాడు. దీంతో బస్వయ్య అక్కడికక్కడే మృతిచెందగా తీవ్రగాయాలపాలైన తిరుపతమ్మ చికిత్సపొందుతూ 8రోజుల తరువాత అక్టోబర్ 13న మృతి చెందింది. గంగనమోని శ్రీను ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అప్పటి సీఐ, సత్యనారాయణ కేసు నమోదు చేసుకొని నిందితుడు రాజమల్లును అరెస్టు చేసి రిమాండ్ చేశాడు. వాదోపవాదాల అనంతరం జిల్లా న్యాయమూర్తి జయరాజు నిందితుడు రాజమల్లుకు పది సంవత్సరాల జైలు శిక్ష, రూ, 20వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసును వాదించిన పీపీ శ్రీనివాస్ రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ నారాయణరెడ్డి, లైజన్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు, రూరల్ సీఐ వి.సంతోష్‌కుమార్‌ను రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు అభినందించాడు.

15 మందికి ప్రాణాలు బలిగొన్న డ్రైవర్‌కు పదేండ్ల జైలు

● ట్రాక్టర్ యజమానికి రూ.5 వేల జరిమానా
● వేములకొండ ప్రమాద ఘటనపై కోర్టు తీర్పు

వలిగొండ, మార్చి 24 : లైసెన్స్ లేకుండా నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడిపి 15 మంది వ్యవసాయ కార్మికుల ప్రాణాలు పోవడానికి కారణమైన డ్రైవర్‌తోపాటు ట్రాక్టర్ యజమానికి నల్లగొండ ఎస్సీ, ఎస్టీ సెషన్స్ కోర్టు శిక్ష వేసింది. డ్రైవర్‌కు పదేండ్ల కఠిన కారాగార శిక్ష, ట్రాక్టర్ యజమానికి రూ.5 వేల జరిమానా విధించింది. కోర్టు తీర్పు వివరాలను వలిగొండ ఎస్ఐ యుగంధర్ మీడియాకు తెలిపారు. 2018 సంవత్సరంలో వేములకొండ గ్రామంలో ట్రాక్టర్ మూసీ కాల్వలో పడడంతో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. 17 మంది గాయపడ్డారు. వ్యవసాయ పనులకు వినియోగించవలసిన ట్రాక్టర్‌లో చట్ట విరుద్ధంగా వ్యవసాయ కార్మికులను తరలించడమే కాకుండా లైసెన్స్ లేకుండా డ్రైవర్ ఆలూరి వెంకటనారాయణ అజాగ్రత్తగా నడపడంతోనే జరిగిందని కేసు నమోదు చేశారు. దానికి సంబంధించిన తీర్పును కోర్టు సోమవారం వెల్లడించింది. ట్రాక్టర్ డ్రైవర్ ఆలూరి వెంకటనారాయణతోపాటు ట్రాక్టర్ యజమాని దూదిపాళ్ల నాగేశ్వర్‌రావును దోషులుగా తేల్చింది. మోటార్ వాహనాల చట్టం ప్రకారం వెంకటనారాయణకు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, నాగేశ్వర్‌రావుకు రూ.5 వేల జరిమానా విధించింది.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆత్మకూరు(ఎం) : తిమ్మాపురంలో రమేశ్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

ఆత్మకూరు(ఎం), మార్చి24 : మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన శ్యామల రమేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుని కుటుంబానికి 2005–2006 సంవత్సరంలో మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో చదివిన తోటి స్నేహితులు సోమవారం రూ.56,500 ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. మహేశ్, శేఖర్, శ్రీశైలం, సతీశ్, వెంకటేశ్, రవీందర్‌రెడ్డి, ఆంజనేయులు, నరేశ్, భిక్షపతి పాల్గొన్నారు.

జాలలో..

రాజాపేట : మండలంలోని జాల గ్రామానికి చెందిన చెవిటి ప్రభాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జాల మైసమ్మ ఫౌండేషన్ సభ్యులు మృతుడి కుటుంబాన్ని సోమవారం పరామర్శించి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ గంధమల నరసింహులు, ముక్కెర సాయిలు, గుర్రాల బాల కనకయ్య, దొబ్బల గణేశ్, చంద్రయ్య ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి గొంగిడి సునీత పరామర్శ

జంపాల దశరథను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

ఆలేరు టౌన్, మార్చి 24 : ఆలేరు పట్టణం బహుదూర్‌పేటకు చెందిన మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకుడు జంపాల దశరథ ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనను సోమవారం మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతమహేందర్‌రెడ్డి పరామర్శించారు. వారికుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.

సన్న, దొడ్డు బియ్యం కలిపి అమ్మితే కఠిన చర్యలు

రేషన్ దుకాణంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న తాసీల్దార్ లావణ్య

ఆత్మకూరు(ఎం), మార్చి24 : ఉగాది పండుగ నుంచి ప్రభుత్వం రేషన్ కార్డు దారులకు సన్నబియ్యం పంపిణీ చేయనుందని, సన్న బియ్యం, దొడ్డు బియ్యం కలిపి అమ్మితే చర్యలు తీసుకుంటామని తాసీల్దార్ లావణ్య తెలిపారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని రేషన్ దుకాణాలను సోమవారం ఆమె తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ నెల 30వరకు రేషన్ దుకాణాల్లో మిగిలిన దొడ్డు బియ్యాన్ని కార్డుదారులకు ఇవ్వకుండా భద్రపర్చాలన్నారు. ఆమె వెంట డిప్యూటీ తాసీల్దార్ సఫియొద్దీన్, ఆర్ఐ మల్లికార్జున్‌రావు తదితరులున్నారు.

వలిగొండ-తొర్రూరు రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని వినతి

భువనగిరి కలెక్టరేట్, మార్చి 24 : వలిగొండ-తొర్రూరు వరకు 69 కిలోమీటర్ల పొడవున జరుగుతున్న నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలపై అధికారులు సమగ్ర చర్యలు చేపట్టాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డికి వినతి పత్రం అందజేశారు. వలిగొండ నుంచి తొర్రూరు వరకు జరుగుతున్న రోడ్డు పనుల్లో నాణ్యత లోపించిందని, చాలా చోట్ల రోడ్డు బీటలుబారి, డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని పేర్కొన్నారు. ప్రమాద సూచిక బోర్డులను పెట్టకుండా రోడ్డు పనులు చేస్తూ వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని,
వెంటనే విడిబి కన్స్ట్రక్షన్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏషాల అశోక్, ఏఐవైఎఫ్ వలిగొండ మండల కార్యదర్శి సుద్దాల సాయికుమార్ తదితరులున్నారు.

నిరుద్యోగ భృతిని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి

● ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్

సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్

భువనగిరి అర్బన్, మార్చి 24 : కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరబోయిన మహేందర్ అన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య భువనగిరి మండల కమిటీ సమావేశం సోమవారం భువనగిరిలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచార ఆర్బాటాలకు ఇస్తున్న ప్రాధాన్యత ఉద్యోగాల భర్తీపై లేదని అన్నారు. పేరుకు మాత్రమే జాబ్ క్యాలెండర్ ప్రకటించిందని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులున్నా నియామకాలు చేపట్టకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వ రాయితీలతో నెలకొల్పిన పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కోర్టు వివాదాలు లేకుండా ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్, పట్టణ కార్యదర్శి పుట్ట రమేశ్, నాయకులు దాసరి లక్ష్మయ్య, అరుణ్, నర్సింహ, శేఖర్, రాజు పాల్గొన్నారు.

రుద్రాల స్వామికి గౌరవ డాక్టరేట్

పట్టా అందుకుంటున్న రుద్రాల స్వామి

రామన్నపేట, మార్చి 24 : సమాజంలో అందిస్తున్న సేవలకుగానూ మండలంలోని ఇంద్రపాల నగరం గ్రామానికి చెందిన రుద్రాల స్వామికి యునైటెడ్ నేషన్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్, గ్లోబల్ అక్రిడిటేషన్ కౌన్సిల్ జర్మనీ వారు 2025 సంవత్సరానికిగానూ గౌరవ డాక్టరేట్ పట్టాను అందజేశారు. ఈ నెల 23న రాత్రి పాండిచ్చేరిలో జరిగిన కార్యక్రమంలో పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా స్వామిని గ్రామస్తులు, బంధుమిత్రులు అభినందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

రామన్నపేట, మార్చి24 : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2008-09 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. తమ పాత జ్ఞాపకాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా
ఉపాధ్యాయులు అన్నమ్మ, ఫాతిమ, గీత, ఆండాలు, పద్మజ, సృజనకుమారి, అరుణ శ్రీను సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు బండ స్వాతి, రేఖ, శ్రీలత, మధుశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏ వారసుల అరెస్ట్



మోత్కూరులో పోలీసులు అరెస్ట్ చేసిన వీఆర్‌ఏ వారసులు

మోత్కూరు, మార్చి24 : జీఓ 81, 85 ప్రకారం తమకు ఉద్యోగాలు కల్పించాలని సోమవారం హైదరాబాద్‌లో శాంతియుతంగా ధర్నా చేయడం కోసం జిల్లా నుంచి వీఆర్‌ఏ వాసులు బయల్దేరారు. మోత్కూరులో పోలీసులు అరెస్ట్ చేశారు. తమను అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 61 సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏల వారసుల సమస్యను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జక్కుల ఎల్లయ్య, గొడుగు మత్స్యగిరి, బత్తిని రవికిశోర్, అంబటి ఎల్లేశ్ ఉన్నారు.

బహిరంగ ప్రకటన

తేది: 24-03-2025

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్స్‌యగు 1) శ్రీమతి నాగపురి చంద్రకళ, W/o. లేట్ కుమారస్వామి, 2) ఎముడాల (వడ్ల) మధుచారి, S/o. లేట్ రాంచంద్రచారి, R/o. వీరారెడ్డిపల్లి గ్రామం, తుర్కపల్లి మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా గార్లు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, భువనగిరిలో భాగ పంపిణీ గురించి O.S.No. 20/2023 గల దావా శ్రీ బంగారు నర్సింహ్మాచారి, బంగారు వీరాచారి, బంగారు అండాలు, బంగారు నర్సమ్మ, బంగారు యాదవచారి మరియు బంగారు (వడ్ల) శ్రీనివాసచారి, R/o. వీరారెడ్డిపల్లి గార్లపై సర్వే నెం. 223లో ఎ. 2-28 గుంటలు మరియు సర్వే నెం. 398లో ఎ. 0-29 గుంటలు, సర్వే నెం. 399లో ఎ. 4-18 గుంటలు, మొత్తం ఎ. 7-35 గుంటల భూమిపై వీరారెడ్డి పల్లి గ్రామం, తుర్కపల్లి మండలంలో యాదాద్రి భువనగిరి జిల్లాలోగల భూమిపై PARTITION దావా ఉన్నందున, అట్టి కేసు దాచిపెట్టి పైవారలు ఇతరులకు అన్యాక్రాంతం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు నా క్లయింట్స్‌కు తెలిసినందున, పై భూమిని ఎవరూ అమ్మడంగానీ, కొనడంగానీ, ఎలాంటి లావాదేవీలుగానీ చేయరాదని మరియు ఒకవేళ కొనుగోలు చేసినట్లయితే వారే బాధ్యులు అవుతారని ఈ నోటీసు ద్వారా సమస్త ప్రజలను హెచ్చరించనైనది.

పైల్ల లింగారెడ్డి, న్యాయవాది
ఇం.నెం. 3-2-121/2, మీనా నగర్,
భువనగిరి-508 116, యాదాద్రి భువనగిరి జిల్లా,
సెల్: 9848026024.

వార్డుల్లో సమస్యలను వెంటనే పరిష్కరించాలని వినతి

భువనగిరి అర్బన్, మార్చి 24 : భువనగిరి పట్టణంలో వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనూరాధ అన్నారు. మున్సిపల్ డీఈ వై. కొండలరావుకు సోమవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో హుస్సేనాబాద్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో నీటి ఎద్దడి, రోడ్లు, డ్రైనేజీ సమస్య ఉన్నదన్నారు. కాలనీలో కట్టిన వాటర్ ట్యాంకులో కృష్ణా నీరు నింపి కాలనీ ప్రజలకు సరఫరా చేయాలని కోరారు. అర్బన్ కాలనీ ఒకటో వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పూర్తి చేసి, స్మశాన వాటికకు వెళ్లే దారిలో రోడ్డును నిర్మించాలని తెలిపారు. ఆమె వెంట పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ, పట్టణ కమిటీ సభ్యులు దండుగిరి, కృష్ణ, ఎనబోయిన లింగమూర్తి ఉన్నారు.

సులువుగా డబ్బు సంపాదించొచ్చని ఆశచూపి మోసం

భువనగిరి కలెక్టరేట్, మార్చి 24 : ఆన్‌లైన్‌లో మోసపోయి రూ.1.70 లక్షలు పోగొట్టుకున్న సంఘటన భువనగిరి పట్టణ పరిధిలోని రాయగిరిలో చోటుచేసుకుంది. రూరల్ సీఐ సంతోష్ కుమార్ తెలిపిప వివరాల ప్రకారం కృష్ణా జిల్లాకు చెందిన గోసల శ్యామలరావు బతుకుదెరువు కోసం రాయగిరిలో గత సంవత్సరం నుంచి నివాసముంటున్నాడు. ఈ నెల 15న పార్ట్ టైమ్ జాబ్ కోసం గూగుల్‌లో వెతుకుతూ వచ్చిన ఫామ్‌లో తన వివరాలను నమోదు చేసుకున్నాడు. దీంతో కొత్త నంబర్ల నుంచి ఫోన్ చేసి ఇంట్లో ఉండి డబ్బులు సంపాదించవచ్చని నమ్మపలికించారు. రూ.1000 వేస్తే తిరిగి తన అకౌంట్‌లోకి రూ.1,300 జమచేశారు.
సులువుగా లాభం వస్తుందని ఆశపడ్డ బాధితుడు విడుతల వారీగా రూ.1,72,000 పోగొట్టుకున్నాడు. ఆలస్యంగా గుర్తించిన బాధితుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఐటీ ఆక్ట్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

28న భువనగిరిలో ఇఫ్తార్ విందు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ కృష్ణారెడ్డి

భువనగిరి అర్బన్, మార్చి 24: రంజాన్ పండుగను పురస్కరించుకుని భువనగిరి నియోజకవర్గంలోని ముస్లింలకు ఈ నెల 28న పట్టణంలోని వైఎస్‌ఆర్ గార్డెన్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయనున్నట్లు ఆర్డీఓ కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ముస్లిం మత పెద్దలతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ విందుకు స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హాజరువుతారని, ముస్లింలందరూ పాల్గొనాలని తెలిపారు.

తాజ్‌పూర్‌లో ఇఫ్తార్ విందు

ఇఫ్తార్ విందులో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకుడు ర్యాకల శ్రీనివాస్

భువనగిరి కలెక్టరేట్, మార్చి 24 : రంజాన్ పురస్కరించుకుని మండలంలోని తాజ్‌పూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్ సోమవారం రాత్రి ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ముస్లింలు పవిత్ర రంజాన్‌ను ప్రశాంతంగా శ్రీనివాస్ కోరారు. గ్రామస్తులు, ముస్లింలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.